క్లుప్తంగా

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వంగూరీ రాములు

పాతమంచిర్యాల: కార్మిక చట్టాల సవరణ, లేబర్ కోడ్‌ల రద్దు చేయాలనే డిమాండ్‌లతో జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరీ రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక హాల్లో శనివారం సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను ఖండిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షురాలు భానుమతి, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, శోభ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శివాజీ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో మల్టి స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని సిద్దిపేట ఆర్‌వీఎం క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా 350మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 220మందికి ఈసీజీ, 120 మందికి బ్లడ్ షుగర్ టెస్టులు, 70మందికి అల్ట్రాసౌండ్ టెస్టులు నిర్వహించారు. ఆర్వీఎం క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ సీహెచ్ నర్సయ్య వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఉచిత భోజన వసతి కల్పించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి, ఆర్వీఎం క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ సీహెచ్ నర్సయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చందూరీ మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కిషన్, రక్తనిధి కేంద్రం, ఆనంద నిలయం సభ్యులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన కొత్తచిందం తిరుమల (35)కనిపించడం లేదని స్థానిక ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తిరుమల కొంతకాలం క్రితం భర్తకు విడాకులిచ్చి తల్లితో కలిసి ఉంటుంది. ఈ నెల 3న మధ్యాహ్నం ఇంటిలో నుంచి వెళ్లిపోయి రాత్రి మంచిర్యాలలోనే ఓ స్నేహితురాలి వద్ద ఉన్నానని, బుధవారం 4న ఇంటికి వస్తానని తల్లికి సమాచారం ఇచ్చింది. 4న ఇంటికి రాకపోగా తన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కనిపించకుండా పోయింది. దీంతో స్నేహితుల, బంధువుల ఇళ్లలో వెతికినా తిరుమల ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి బక్కవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన ఆవోపా సభ్యుల ప్రమాణస్వీకారం

లక్సెట్టిపేట: మండలంలోని ఆవోపా (ఆర్య వైశ్య అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్) నూతన కార్యవర్గ సభ్యులు శనివారం స్థానిక వాసవీమాత ఆలయం వద్ద ప్రమాణ స్వీకారం చేశారు. మండలాధ్యక్షుడిగా కొత్త కిరణ్‌కుమార్, కార్యదర్శి చింతల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి దొమ్మాటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దొంతుల చంద్రశేఖర్ నూతనంగా ఎన్నికయ్యా రు. రాష్ట్ర నాయకులు గుండ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు వొజ్జల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి కొంజర్ల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రమాదేవి, సరిత పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



సన్మానిస్తున్న వికాస తరంగిణి, విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం సభ్యులు

చెన్నూర్: పట్టణానికి చెందిన రేవెల్లి కీర్తన అనే విద్యార్థి ఎన్‌ఐడీలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన సందర్భంగా శనివారం వికాస తరంగిణి, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. చెన్నూర్‌కు చెందిన రేవెల్లి కీర్తన గొప్ప విజయం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నానమ్మ తారాబాయి, తల్లిదండ్రులు రాజేశ్, పద్మజ, విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశ్వేరం రమేష్‌చారి, వికాస తరంగిణి చెన్నూర్ శాఖ అధ్యక్షుడు భీమిని రవీందర్‌గౌడ్, పబ్లిక్ కో ఆర్డినేటర్ కట్ల శ్రీనివాసాచార్యులు, మహాలక్ష్మి దంపతులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



రామకృష్ణాపూర్: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



తాండూర్: మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్సెట్టిపేటలో...



చెన్నూర్: ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



మందమర్రిరూరల్: నమాజ్ చేస్తున్న ముస్లింలు



భీమారం: ముస్లింలతో ఎస్సై శ్వేత



దండేపల్లి: ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జన్నారం: శుభాకాంక్షలు చెప్పకుంటున్న ముస్లింలు



నెన్నెల: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

భీమారం/చెన్నూర్/జన్నారం/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/నెన్నెల/బెల్లంపల్లి/తాండూర్/దండేపల్లి/రామకృష్ణాపూర్: జిల్లా వ్యాప్తంగా బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాంప్రదాయ కొత్త బట్టలు ధరించి ముస్లింలు సమీప మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండగ సందేశాన్ని అందించారు. మత సామరస్యాలు వెల్లివిరియాలని అల్లాను ప్రార్థించారు. పేదవారికి సాయం చేయడం వల్ల శుభాలు కలుగుతాయని, బక్రీద్ ప్రత్యేకతను మత గురువు చదివి ముస్లింలకు వినిపించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరు కలిసి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొందరు ముస్లింలు ఇళ్లలో మేకలను కుర్బానీ ఇచ్చారు. ఆ కుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేద ప్రజలకు పంచిపెట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్సార్పీ 1 గని మేనేజర్‌గా ఆత్మారాం సహాని



మేనేజర్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1గని నూతన మేనేజర్‌గా ఆత్మారాం సహాని శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గని అధికారులు, ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని ఉత్పత్తి లక్ష్యాల సాధనకు, రక్షణతోకూడిన ఉత్పత్తికి కృషి చేస్తానన్నారు. అనంతరం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బత్తుల రాజేశం, మేడం తిరుపతి, వికాస్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేశారు.

'నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం'



మంజూరు పత్రాలు అందజేస్తున్న సీఐ కుమారస్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

తాండూర్: గూడు లేని ప్రతి ఒక్కరికీ నిలువ నీడ కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారికి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోచంపల్లి, నర్సాపూర్, రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ పథకంలో నూతనంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సీఐ కుమారస్వామితో కలిసి శనివారం ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సౌజన్య, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కాపర్తి సుభాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ సూరం దామోదర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు వేళాయె

• ముస్తాబవుతున్న దశవతారాల క్షేత్రం



రేణుక ఎల్లమ్మ వద్ద జాతర పనుల్లో గ్రామస్తులు

వేమనపల్లి: రాజారాం దశవతారం దేవతాక్షేత్రమైన రేణుక ఎల్లమ్మ తల్లి ఇల్లారు వద్ద ఆదివారం నుంచి ఎల్లమ్మ జాతర ప్రారంభం కానుంది. మూడు రోజుల ముందే దేవస్థానం వద్ద జాతర సందడి నెలకొంది. భక్తులు తరలివచ్చి మొక్కులర్పిస్తున్నారు. తూర్పున ప్రాణహిత నది పశ్చిమన ఎల్లమ్మగుట్ట పంట పొలాల మధ్య కొలువై ఉన్న ఈ దేవతాక్షేత్రం అనాదిగా చరిత్ర ఉంది. శతవాహనులు, కాకతీయ కాలంలో ప్రతిష్ఠించబడ్డ రేణుక ఎల్లమ్మ ఉగ్రనరసింహుడు, స్త్రీమూర్తి, వేణుగోపాలస్వామి, పరుషురాముడు, కాలింగమర్ధనుడు, గౌతమ బుద్ధుడు, ఆంజనేయుడు, శ్రీరాముడు, కాళబైరవుడు, కూర్మావతారం భారీ శిలలతో మల్చిన విగ్రహాలు ఇక్కడ ప్రత్యేకం. భారత దేశాన్ని గతంలో పాలించిన మమ్మదీయుల కాలంలో హిందూ దేవాలయాలపై దాడులు జరిపిన నేపథ్యంలో ఇక్కడ దేవతామూర్తులను శిథిలం చేశారు. విగ్రహాల ముక్కు, చెవులు, వక్షస్థలాలను కోశారు. అప్పటి నుంచి నిత్య పూజలు లేకుండా ప్రతీ ఏడాది జూన్ మాసంలో పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. గ్రామ దేవతలు, రేణుక మాతను సమీపంలోని ప్రాణహిత నదికి పుణ్యస్నానానికి తీసుకెళ్లి శుద్ధి చేస్తారు. గ్రామంలో ఆటపాట కార్యక్రమం ఉంటుంది. సోమవారం బోనాలు, మంగళవారం రథోత్సవం కార్యక్రమంతో జాతర ముగియనుంది. మూడు రోజులు జరిగే ఎల్లమ్మ జాతరకు గ్రామం అంతా పండుగ వాతావరణం నెలకొంది. దేవస్థానం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసుకున్నారు. దేవతామూర్తులను అలంకరించడం, రథాలు సిద్ధం చేయడంలాంటివి చేస్తున్నారు.

కొనసాగుతున్న బడిబాట

జన్నారం/లక్సెట్టిపేట/బెల్లంపల్లి/తాండూర్: మండలాల్లో ఆయా గ్రామాల్లో శనివారం 'బడిబాట' నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ.. చిన్నారులను ప్రభుత్వ బడికి పంపించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జన్నారం ఆశ్రమ పాఠశాలలో, మండల గిరిజన ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రధానోపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు అన్నారు. మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాత బెల్లంపల్లికి చేరుకుంది. తాండూర్ మండలంలోని బోయపల్లిలో ఎంఈవో మల్లేశం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

'రైతుల భూములు లాక్కుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం'



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ

నెన్నెల: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుపేద రైతులపై అటవీ శాఖ దాడులు పెరిగాయని వారి భూములను ప్రభుత్వం లాక్కుంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ విమర్శించారు. మండలంలోని ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట గ్రామాల్లో శనివా రం పర్యటించారు. రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద రైతుల భూములను లక్ష్యంగా చేసుకొని లాక్కోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే వినోద్ రైతుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు 50ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను అటవీ అధికారులు దాడులు చేస్తూ సాగును అడ్డుకుంటున్నారని, అలాంటి చర్యలకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ ని హెచ్చరించారు. రాష్ట్ర మంత్రి సీతక్క నిర్వహించిన సమావేశంలో అటవీ శాఖ అధికారులు రైతుల జోలికి పోవద్దని హెచ్చరించిన, వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్, మండల అధ్యక్షుడు శేఖర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అరవింద్, రైతులు మొండగౌడ్, సతీష్, మధుకర్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి



ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం శ్రీనివాస్

బెల్లంపల్లి: భూగర్బంలో దిగి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ప్రతీ కార్మికుడు తప్పక రక్షణసూత్రాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కె.రఘుకుమార్ అన్నారు. శాంతిఖని గనిపై ప్రాణాంతక ప్రమాదాల నివారణ, భద్రత, అవగాహన కోసం శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రక్షణతో కూడిన పనులు చేపట్టాలన్నారు. గని అధికారులు, కార్మికులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సరైన అవగాహనతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ మల్లేష్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, సీఎంవో ఏఐ నాగవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ బసవరాజు, గని రక్షణ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్షణతో పని చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

శ్రీరాంపూర్: రక్షణతో పనిచేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ ఉద్యోగులను కోరారు. ఎస్సార్పీ 3 గనిపై శనివారం ఫ్యాటల్ ఫ్రీ జూన్-2025 ప్రత్యేక భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ సంవత్సరం జూన్ నెలలో ఏదో ఒకచోట ఫ్యాటల్ ప్రమాదం జరుగుతుందన్నారు. ఈ సారి జరగకుండా ఉండటం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గనిలో రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. రక్షణతో పనిచేయాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ, రక్షణ పరికరాలను ధరించి పనిచేయడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రక్షణ అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. గనికి వచ్చేటప్పుడు బైక్‌ఐతే హెల్మెట్, కారులో వస్తే సీటు బెల్ట్ ధరించి రావాలన్నారు. గనిలో కూడా రక్షణతో పనిచేసి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, గని మేనేజర్ విజయ్‌కుమార్, గ్రూప్ ఇంజనీర్ సాంబశివరావు, గని రక్షణాధికారి మహేందర్, సంక్షేమ అధికారి సాధన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మురళీచౌదరీ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశప్రజలకు రక్షణ

• మండల, పట్టణ కమిటీల ఎన్నిక



గర్మిళ్ల జోన్ కమిటీకి నియామక పత్రం అందిస్తున్న ఎనగందుల కృష్ణమూర్తి

భీమారం: బీజేపీతోనే దేశప్రజలకు సరైన రక్షణ ఉంటుందని ఆ పార్టీ జిల్లా నాయకులు కాశెట్టి నాగేశ్వర్ రావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బోర్లకుంట శంకర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొమ్ము దుశాంత్, సెగ్యం మల్లేశ్, దుర్గం కత్తెరశాల, ఆకుదారి శంకర్, ప్రధాన కార్యదర్శులుగా మాడెం శ్రీనివాస్, వేల్పుల రాజేశ్, కార్యదర్శులుగా తాటి సమ్మాగౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్యామల, కోశాధికారిగా కొమురయ్య ఎన్నికయ్యారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా రంగు శ్రీనివాస్, వినయ్, ఉపాధ్యక్షులుగా శనిగారపు శ్రీనివాస్, రాజేందర్, ఓదెలు, తిరుపతి, కోశాధికారిగా సంతోష్, కార్యదర్శులుగా సరోజ, రాజేంద్రప్రసాద్, సత్యం బాబు, పార్వతి ఎన్నికైనట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

చెన్నూర్‌రూరల్: బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కిష్టంపేటలోని బీఎంఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం మండల కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రత్న లక్ష్మీనారాయణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే దుర్గం అశోక్ హాజరై మాట్లాడారు.

చెన్నూర్: పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్ అధ్యక్షతన శనివారం పీఎం నరేంద్రమోడీ 11ఏళ్ల సుపరిపాలన, పర్యావరణ దినోత్సవ యోగ ఎమర్జెన్సీ డే భవిష్యత్తు కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ హాజరై పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులతో కలిసి మొక్క నాటారు. కార్యక్రమంలో రెండు తీర్మానాలు ప్రవేశపెట్టారు. అనంతరం చెన్నూర్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా జాడి సురేఖ, నాథంగారి సత్యనారాయణ, గర్రెపల్లి శాంతాకుమారి, ప్రధాన కార్యదర్శిగా కాయిత రాజేశ్వర్, కార్యదర్శులుగా అడుప రేణుకదేవి, కాసుల సుధీర్, కాయిత వెంకటేశ్, నరేష్ జెంజర్ల, కోశాధికారిగా రాపర్తి మధుకర్‌ను నియమించారు.

నెన్నెల: మండల కేంద్రంలో బీజేపీ అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ హాజరయ్యారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకట రమణరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బందెల రవిగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ పూర్తిస్థాయి మండల కమిటీని శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా డాంక లక్ష్మణ్, వనపర్తి రాకేష్, ఎర్రం విజయేందర్, ప్రధాన కార్యదర్శులుగా పత్తిపాక సంతోష్, అక్కల దివ్య, ముత్తె అనిల్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాజయ్య, సురేందర్, సురేష్, శ్రీనివాస్, వెంకటేష్, సత్తయ్య, మల్లేష్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని బీజేపీ గర్మిళ్ల జోనల్ కమిటీని శనివారం మంచిర్యాల పట్టణ ఇన్‌చార్జి ఎనగందుల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గర్మిళ్ల జోన్ అధ్యక్షుడిగా అమిరిశెట్టి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా నేరేడుకొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణలతో పాటు, 35మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్ధన్, నాగేశ్వర్‌రావు, గడ్డం స్వామిరెడ్డి పాల్గొన్నారు.

జైపూర్: మండల బీజేపీ పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లుగా బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులుగా వేముల తిరుపతిగౌడ్, చేగొండ శ్రీనివాస్, రామగిరి రాము, మండల ఉపాధ్యక్షులుగా రమేశ్‌గౌడ్, గణేశ్, కుమారస్వామి, లవ్‌కుమార్, కార్యదర్శులుగా చంద్రమౌళి, మునిధర్ రెడ్డి, రజిత, రమాదేవి, కోశాధికారులుగా శ్రీకాంత్‌లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ముగిసిన చిరుతల రామాయణం



జైపూర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణం చివరి రోజున శనివారం పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. జైపూర్, దుబ్బపల్లి గ్రామానికి చెందిన సీతారామభక్తులు నెలరోజుల పాటు కోటపల్లి మండలం ఎదులబంధంకు చెందిన కోటారి మల్లయ్య పంతులు నేతృత్వంలో, సంఘసేవకులు, భూనీలసమేతా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు బల్మూరి అరవిందర్‌రావు ఆధ్వర్యంలో ఆయా పాత్రదారులు కఠోరసాధన చేసి ఐదు రోజులుగా వారు నేర్చుకున్న చిరుతరామాయణాన్ని ప్రజల ముందుకు తీసుకురాగా, ప్రజలంతా చిరుతల రామాయణాన్ని కనులారా వీక్షించి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

'బెల్టుషాపులు తొలగించాలి'

కొటాల: బెల్టుషాపులు తొలగించాలని కోరుతూ శనివారం గురుడుపేట గ్రామ మహిళలు పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విచ్చలవిడిగా నాటుసారా విక్రయిస్తున్నారని, మద్యానికి బానిసై 20 మంది పురుషులు మృతి చెందారని వాపోయారు.